క్లుప్తంగా

అరుంధతీ కాలనీ కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులతో నిర్వాహకులు

తుర్కయంజాల్: తుర్కయంజాల్ మున్సిపాలిటీ మన్నెగూడలోని అరుంధతీ కాలనీ నూతన కార్యవర్గాన్ని సోమవారం కాలనీలో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా భూపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి జిమ్మి జాన్ కేఎం, కోశాధికారి జగదీష్, గౌరవ అధ్యక్షుడిగా మోహన్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా నాగార్జున, జాయింట్ సెక్రటరీ రామ్మోహన్ రావు, సాంస్కృతిక కార్యదర్శి విజయలక్ష్మి, సలహాదారు శ్రీనివాస్‌రెడ్డి, కార్యనిర్వాహక సభ్యులు ఆర్. శ్రీనివాస్, అశోక్, నర్సింహ చారి, నారాయణ రెడ్డి, నాగభూషణం, శ్రీనివాసరావు, ఆదిత్య, నవీన్‌రెడ్డి, క్రిస్టోఫర్‌ను ఎన్నుకున్నారు.

రవిరాథోడ్‌కు సత్కారం



రవిరాథోడ్‌ను సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

ఆమనగల్లు: రాష్ట్ర బీజేపీ ఎస్టీ మోర్చా సోషల్ మీడియా కన్వీనర్‌గా ఆమనగల్లుకు చెందిన రవిరాథోడ్‌ను నాగర్ కర్నూల్ జిల్లా బీజేపీ నాయకులు ఘనంగా సత్కరించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో సోమవారం జరిగిన బీజేపీ సోషల్‌మీడియా సమావేశంలో రవిరాథోడ్‌ను వారు సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బాలకృష్ణ, నరేశ్, అంజన్‌కుమార్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

16 వరకు లోక్ అదాలత్

ఎస్ఐ శ్రీకాంత్

తలకొండపల్లి: 'రాజీ మార్గమే రాజమార్గమని' ఎస్ఐ శ్రీకాంత్ అన్నారు. చిన్న చిన్న తగాదాలు, క్షణికావేశంలో జరిగిన గొడవలు, అహంకార పూరితమైన కక్ష్య సాధింపు కొట్లాటలు తదితర నేరాలను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని సూచించారు. ఈనెల 16 వరకు ఆమనగల్లు కోర్టులో లోక్ అదాలత్ ఉంటుందని, ఆ లోగా తమ కేసులను రాజీ చేసుకోవాలని ప్రజలకు ఎస్ఐ సూచించారు.

నేడు క్రీడాపోటీలు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో మంగళవారం నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో 18 నుంచి 30 సంవత్సరాల్లోపు ఉన్న యువతీ యువకులకు క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఫారూక్‌హుస్సేన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో రన్నింగ్ పోటీలు, స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో వాలీబాల్, ఖోఖో, క్యారమ్స్ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి ఉన్నవారు పోటీల్లో పాల్గొనాలని ఎంపీడీఓ కోరారు.

మీసేవ నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

తహసీల్దార్ అయ్యప్ప

యాచారం: మీసేవ నిర్వాహకులు నింబంధనల ప్రకారం ప్రజలకు సేవలు అందించాలని యాచారం తహసీల్దార్ అయ్యప్ప సూచించారు. మండల కేంద్రంలో ఉన్న మీసేవ కేంద్రాలను సోమవారం ఆయన సందర్శించారు. ప్రభుత్వానికి సంబంధించిన మెజార్టీ సేవలకు మీసేవ కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకునే అవకాశం ఉందని అన్నారు. అందువల్ల నిర్వాహకులు జాగ్రత్తగా ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారమే సేవలకు ఫీజులు వసూల్ చేయడంతో పాటు ప్రతి సర్వీస్‌కు రసీదులు ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాచారం మీసేవ కేంద్రం నిర్వాహకుడు మహేష్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని విఠాయిపల్లికి చెందిన ప్రమోద్ కూతురు తన్విశ్రీ(2) గుండె సంబంధిత వ్యాధితో చికిత్సపొందుతూ ఇటీవల మృతిచెందింది. విషయం తెలియడంతో విఠాయిపల్లిలో సోమవారం తన్విశ్రీ కుటుంబ సభ్యులను రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రెడ్డి, శేఖర్, సుమన్‌నాయక్, ప్రశాంత్, తిరుమలేశ్, మహేశ్, నరేశ్ తదితరులు ఉన్నారు.

ఇసుక ఫిల్టర్ కూల్చివేత

తలకొండపల్లి: అక్రమంగా కృతిమ ఇసుక తయారు చేస్తున్న ఇసుక ఫిల్టర్‌ను పోలీసులు కూల్చివేశారు. ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని పడకల్ శివారు ప్రాంతంలో కృతిమ ఇసుక తయారుచేస్తున్నారనే సమాచారంతో సోమవారం అక్కడికి వెళ్లిన పోలీసులు ఇసుక ఫిల్టర్‌ను కూల్చివేశారు. ఇసుక డంపును సీజ్ చేశారు. జేసీబీని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నిర్వాహకుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వందశాతం వసూళ్లే లక్ష్యం

- మున్సిపాలిటీ పరిధిలో రూ.6.38 కోట్ల పన్నుల డిమాండ్
- ఇప్పటివరకు రూ.3.38 కోట్ల మేర సేకరణ
- గడువులోపు లక్ష్యం చేరుకుంటామంటున్న అధికారులు
- ప్రత్యేకంగా 20 మంది సిబ్బంది కేటాయింపు



ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలో వంద శాతం పన్నుల వసూళ్లే లక్ష్యంగా అధికారులు ప్రణాళికలతో ముందుకెళ్తున్నారు. ఇంటిపన్నుతోపాటు వ్యాపార దుకాణాలు, పరిశ్రమలు, వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు, కార్యాలయాలు, విద్యాలయాల ద్వారా 2023–24 సంవత్సరానికిగాను రూ.6,38,43,000 పన్నులు వసూలు చేయాలని టార్గెట్‌గా పెట్టుకోగా ఇందులో గత సంవత్సరం పెడింగ్ బాకాయిలు రూ.2.42 కోట్లు ఉన్నాయి. మార్చి 11వ తేదీ వరకు(సోమవారం) రూ.3,00,68,000 మేర పన్నులు వసూలయ్యాయి. అంటే సుమారు 52 శాతం మేరకు మాత్రమే పన్నులు వసూలైనట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో మార్చి 31వ తేదీ(తుది గడువు)లోపు నిర్ణీత లక్ష్యం చేరుకునేలా మున్సిపల్ యంత్రాంగం కార్యచరణ ప్రారంభించింది. 100 శాతం పన్నులను వసూలు చేసి మున్సిపాలిటీ అభివృద్ధికి వినియోగించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

తగ్గిన ఆదాయవనరులు..

గత మూడేళ్లుగా మున్సిపాలిటీకి ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆదాయ వనరులు తగ్గాయి. దీంతో సిబ్బంది జీతభత్యాలు, అభివృద్ధి పనులకు డబ్బులు కావాలంటే.. భవన నిర్మాణాల అనుమతులు, బెటర్‌మెంట్ చార్జీలు, వివిధ పన్నుల రూపేణా వచ్చే ఆదాయంపై ఆధారపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో మున్సిపల్ అధికారులు ప్రత్యేకంగా 20 మంది సిబ్బందిని పన్నుల వసూళ్లకై నియమించారు. ప్రతిరోజు ఇంటింటికి, ప్రతి దుకాణానికి తిరుగుతూ పన్నులు వసూలు చేయాల్సిన బాధ్యతను వీరిపై పెట్టారు. ఇప్పటికే పన్నుల చెల్లించనవారికి రెడ్ నోటీసులను అందజేశారు. వారిపట్ల కఠినంగా వ్యవహరించాలని అధికారులు నిర్ణయించారు.

సౌకర్యాల నిలిపివేత..

ఇప్పటికీ పన్నులు చెల్లించకుంటే మున్సిపాలిటీ కల్పిస్తున్న సౌకర్యాలను నిలిపివేసేందుకు సిద్ధం అవుతున్నారు. ఇందులో మొదటగా ఇంటి నల్లా కనెక్షన్‌ను కట్‌చేసి నీటి సరఫరాను నిలిపివేస్తామని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. అయితే ప్రభుత్వ సంస్థలు, కార్యాలయాల నుంచి రావాల్సిన సుమారు 2.50 కోట్ల రూపాయల బకాయిలు మాత్రం యాథావిధిగా ఉంటుండటంతో నిర్ణీత వంద శాతం టార్గెట్‌ను పూర్తిచేయలేకపోతున్నామని మున్సిపల్ సిబ్బంది చెబుతుండటం కొసమెరుపు.

పన్నులు చెల్లించకుంటే చర్యలు



ఈ ఆర్థిక సంవత్సరంలోపు వివిధ రకాల పన్నులను వంద శాతం వసూలు చేస్తాం. ఇందుకు అనుగుణంగా 20 మంది సిబ్బందిని పన్ను వసూళ్లకు ప్రత్యేకంగా నియమించాం. పన్నులు చెల్లించాలని రెడ్ నోటీసులు జారీ చేశాం. సకాలంలో పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రజలు సహకరించాలి. చెల్లించనివారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– రవీంద్రసాగర్, మున్సిపల్ కమిషనర్, ఇబ్రహీంపట్నం

బూత్ అధ్యక్షుల సమ్మేళనానికి తరలిరండి

మంచాల: నగరంలోని ఎల్బీ స్టేడియంలో మంగళవారం నిర్వహించే బీజేపీ బూత్ అధ్యక్షుల సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోగిరెడ్డి లచ్చిరెడ్డి అన్నారు. సోమవారం మంచాల మండల కేంద్రంలో ఈ సమ్మేళనానికి సంబంధించిన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోగిరెడ్డి లచ్చిరెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో బీజేపీని మరింత బలమైన శక్తిగా తయారుచేయాలన్నారు. అందుకోసం కొత్త క్యాడర్‌ను పార్టీ వైపు మళ్లించాలన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడమే గాకుండా ప్రజలకు కేంద్ర పథకాలు అందించే విధంగా కృషి చేయాలన్నారు. పార్టీ నిర్మాణంలో నాయకుడి నుంచి కార్యకర్త వరకు శక్తి వంచన లేకుండా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లోని బూత్ అధ్యక్షులు బాధ్యతగా భావించి సమ్మేళన కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు వింజమూరి వెంకట్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు భాషయ్య, నాయకులు.. శ్రీశైలం, నర్సింహారెడ్డి, రాజు ముదిరాజ్, పాండు, జనార్ధన్‌రెడ్డి, రమేష్, వెంకట్‌రెడ్డి, భిక్షపతి, హన్మంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో వాటర్‌ప్లాంట్లు ప్రారంభం

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వ బడుల అభివృద్ధికి దాతలు సహరించాలని విర్బాక్ యానిమల్ హెల్త్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ ఆర్ఎం సిరాజుద్దీన్ కోరారు. ఆదిబట్ల మున్సిపాలిటీ కొంగరకలాన్‌లో గల జెడ్పీహెచ్ ప్రభుత్వ పాఠశాలలో సోమవారం ఆ సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. మంచినీటి సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతుండేవారన్నారు. బోరు బావి నీరు తాగే విద్యార్థులకు సిరాజుద్దీన్ అండగా నిలవడం గర్వకారణమన్నారు. స్థానికంగా ఉండే మరో దాత లింగల్ల భాస్కర్ వాటర్ ప్లాంట్ గది నిర్మాణానికి రూ.20 వేలు విరాళం ప్రకటించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో శివకుమార్‌రెడ్డి, ఏరియా మేనేజర్ డాక్టర్ సురేందర్, రవీందర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న సిరాజుద్దీన్

మంచాల ప్రభుత్వ పాఠశాలలో..

మంచాల: మంచాలలోని ప్రభుత్వ పాఠశాలలో విరిబ్యాక్ యానిమల్ హెల్త్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో సోమవారం ఆక్వాగార్డ్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆ కంపెనీ రీజినల్ మేనేజర్ సిరాజుద్దీన్, ఏరియా మేనేజర్ శివకుమార్‌రెడ్డి, మంచాల పశువైద్యురాలు సుధారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కొత్త సభ్యులను తీసుకుంటాం



సమావేశంలో మాట్లాడుతున్న విఠల్‌రెడ్డి

- బాటసింగారం సహకార సంఘం చైర్మన్ విఠల్‌రెడ్డి
- పాలకవర్గ సమావేశంలో పలు అంశాలపై తీర్మానం

అబ్దుల్లాపూర్‌మెట్: మండల కేంద్రంలోని బాటసింగారం సహకార సంఘం పాలకవర్గ సమావేశం సోమవారం సంఘం కార్యాలయంలో చైర్మన్ లెక్కల విఠల్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఎజెండాలోని పలు అంశాలను తీర్మానించి ఈనెల 28న నిర్వహించే సహకార సంఘం సర్వసభ్య సమావేశంలో సభ్యుల ఆమోదం కోసం ప్రతిపాధించినట్లు చైర్మన్ విఠల్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత సమావేశంలో తీర్మానాల పరిశీలినతో పాటు సంఘం సభ్యత్వం కోసం దరఖాస్తు చేసుకున్న వారి పేర్లను పరిశీలించి ఆమోదించాలని నిర్ణయించినట్లు తెలిపారు. స్వల్పకాలిక రుణాలు అందజేయడంతో పాటు సంఘం పరిధిలో రుణాల వసూల్లు సంతృప్తికరంగా లేని కారణంగా రుణాల వసూళ్ల లక్ష్యాన్ని నెలకు రూ.2 కోట్ల చొప్పున సిబ్బందిచే వసూళ్లు చేయించాలనే అంశాన్ని తీర్మానించి ఆమోదించినట్లు పేర్కొన్నారు. పంట రుణాలను సక్రమంగా చెల్లించే రైతులను గ్రామానికి ఒకరు చొప్పున ఎంపిక చేసి వారికి ప్రోత్సాహకంగా రూ.10 నగదు సహాయంతో సన్మానం చేయాలని తీర్మానం చేశామని, సభ్యుల ఆమోదం పొందాల్సి ఉందన్నారు. సంఘంలో అప్పు తీసుకున్న పలువురు సంఘం డైరెక్టర్లు రుణాలను సకాలంలో చెల్లించని కారణంగా వారిని డీఫాల్టర్లుగా పరిగణలోకి తీసుకోవడం జరిగిందని, ఇట్టి విషయం ప్రస్తుతం హైకోర్టు పరిధిలో ఉన్నందున ఈ ఎజెండాను సర్వసభ్య సమావేశంలో వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. 31–03–2023 వరకు ఉన్న సభ్యుల వాటాధనంపై 6శాతం డివిడెంట్‌ను ఇవ్వాలని చర్చించినట్లు పేర్కొన్నారు. సంఘం పరిధిలో డెయిరీ లోన్లు తీసుకునే రైతుల వద్ద నుంచి రహదారి బిల్స్‌ను వసూలు చేయకూడదని ఏకగ్రీవంగా తీర్మానం చేసి సభ్యుల ఆమోదం కోసం ప్రతిపాదనలు చేసినట్లు విఠల్‌రెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి వైస్ చైర్‌పర్సన్‌తో పాటు 8మంది డైరెక్టర్లు గైర్హాజరు కాగా చైర్మన్‌తో పాటు ఇద్దరు డైరెక్టర్లు కందాడి మహిపాల్‌రెడ్డి, పగిళ్ల బాల్‌రెడ్డి, మేనేజర్ ఐలేష్‌యాదవ్ హాజరయ్యారు.

బాండ్ల వివరాలు బహిర్గతం చేయాలి



తుర్కయంజాల్: ఎస్‌బీఐ ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

- ఎస్‌బీఐ బ్రాంచ్‌ల ఎదుట సీపీఎం నేతల నిరసన

తుర్కయంజాల్: ఎన్నికల బాండ్ల వివరాలను వెంటనే బహిర్గతం చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించినప్పటికీ కోర్టు ఆదేశాలను ధిక్కరిస్తూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వత్తాసు పలుకుతున్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మొండి వైఖరి సరైంది కాదని సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి భాస్కర్ తెలిపారు. సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తుర్కయంజాల్‌లోని ఎస్‌బీఐ కార్యాలయం ఎదుట ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సామేల్, జగదీష్, జిల్లా కమిటీ సభ్యులు జగన్, నర్సింహ, అలంపల్లి నర్సింహ, రవికుమార్, మున్సిపాలిటీ కన్వీనర్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాధనం దుర్వినియోగం..

మంచాల: ఎస్‌బీఐ బాండ్ల పేరుతో ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు యాదయ్య అన్నారు. సోమవారం మంచాల మండల పరిధిలోని ఆరుట్ల ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట సీపీఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. సుప్రీం కోర్టు ఆదేశాలను తప్పక పాటించాలని కోరారు. కేంద్రం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల కార్యదర్శి శ్యాంసుందర్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, బుగ్గరాములు, రాజు, స్వామి, గోపాల్, రవి, వెంకటేశ్, పాండు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మల్లప్పగుట్ట బ్రహ్మోత్సవాలు

తలకొండపల్లి: మండల పరిధిలోని చెన్నారం సమీపంలో వెలిసిన మల్లప్పగుట్ట మల్లికార్జున స్వామి శివాలయ బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిశాయి. వారం రోజులుగా అంగరంగ వైభవంగా ఉత్సవాలు కొనసాగాయి. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకొని పూజలు చేశారు. సోమవారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య దేవతా మూర్తులను ఊరేగించారు. కార్యక్రమములో ఆలయ గౌరవ అధ్యక్షుడు పాండురంగారెడ్డి, ఆలయ ముఖ్య కార్యనిర్వాహకులు పెంటారెడ్డి, మల్లారెడ్డి, శేఖర్‌రెడ్డి, పాండురంగారెడ్డి, మధుసూధన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రంగారెడ్డి, బుచ్చిరెడ్డి, విజేందర్‌రెడ్డి, మల్యానాయక్, శేఖర్‌రెడ్డి, భాస్కర్ రెడ్డి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



శివలింగానికి క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు

గ్రామాల్లో నీటిఎద్దడి రానివ్వొద్దు



సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ సుకన్య, అధికారులు, సభ్యులు

ఎంపీపీ కొప్పు సుకన్య

- వాడీవేడిగా సర్వసభ్య సమావేశం
- భగీరథ నీటి సరఫరా పెంచాలని సభ్యుల వినతి

యాచారం: ఎంపీపీ కొప్పు సుకన్య అధ్యక్షతన సోమవారం నిర్వహించిన యాచారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో సమస్యలపై సభ్యులు ఏకరువు పెట్టారు. రెండేళ్లుగా వర్షాలు లేకపోవడం, ఎండల తీవ్రత రోజురోజుకు పెరగడం, సాగర్‌లో నీటి లభ్యత తగ్గుముఖం పడుతున్న దృష్ట్యా వచ్చే రోజుల్లో మిషన్ భగీరథ నీటి సరఫరాలో ఇబ్బందులు రావచ్చని.. ముందు జాగ్రత్త చర్యగా ప్రజలకు నీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాలని వివిధ గ్రామాల ఎంపీటీసీ సభ్యులు సభలో ప్రస్తావించారు. అలాగే భగీరథ నీటి సరఫరాను పెంచాలని కోరారు. గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్న బోరుబావుల మరమ్మతులు చేపట్టి వాడుకలోకి తేవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను కోరారు. ప్రజలు కూడ నీటిని పొదుపుగా వాడుకునేలా చైతన్యం తేవాల్సిన అవసరం ఉందని అన్నారు. రైతులకు రాయితీపై కూరగాయల నార్లు, డ్రిప్ పరికరాలు అందించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రాధాన్యత కింద పనులు చేపట్టండి..

ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలకు నీటి సమస్య రాకుండా ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ అధికారులు సమన్వయంతో ముందుకు పోవాలని ఎంపీపీ కొప్పు సుకన్య సూచించారు. అవసరమైన గ్రామాలకు మిషన్ భగీరథ నీటిని పెంచాలని, నిరుపయోగంగా ఉన్న బోరుబావుల మరమ్మతులు చేసి వాడుకలోకి తెచ్చే విధంగా కృషి చేయాలని సూచించారు. మండలంలోని 24 గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలకు గాను ఈజీఎస్ నుంచి రూ.4 కోట్లకు పైగా నిధులు మంజూరైనట్లు తెలిపారు. మార్చి 25 లోపే సీసీ రోడ్ల నిర్మాణ పనులు పూర్తిచేసుకోవాలని, లేని పక్షంలో మంజూరైన నిధులు వెనక్కు మళ్లిపోయే అవకాశం ఉందని అన్నారు. మంజూరైన నిధులను సద్వినియోగం చేసుకుని కాలనీల్లోని రోడ్లను అభివృద్ధి పర్చాలని ఆమె ఎంపీటీసీ సభ్యులు, గ్రామాల ప్రత్యేకాధికారులకు సూచించారు. గ్రామాల్లో జరిగే అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ఎంపీటీసీల భాగాస్వామ్యం లేకుండా ముందుకు వెళ్లవద్దని గ్రామాల ప్రత్యేకాధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు జంగమ్మ, ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, తహసీల్దార్ అయ్యప్ప, వివిధ గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, గ్రామాల ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: మండల పరిధిలోని జంగారెడ్డిపల్లికి చెందిన చెన్నయ్య ఇటీవల మృతి చెందాడు. సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వరలక్ష్మి, రాజేందర్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో రమేష్, యాదయ్య, యాదిరెడ్డి, నరసింహ, మాధవరెడ్డి, చంద్రారెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రాములు కుటుంబానికి..

కడ్తాల్: మండల కేంద్రానికి చెందిన రాములు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని సోమవారం సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి పరామర్శించి రూ.5 వేలు ఆర్థికసాయం అందించారు. పరామర్శించిన వారిలో నాయకులు వెంకటేశ్, భిక్షపతి, నర్సింహ, చెన్నయ్య, మల్లయ్య, యాదయ్య, వెంకటేశ్, మహేశ్, బాలరాజు, రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఆలయ భూముల సర్వే మళ్లీ వాయిదా

కడ్తాల్: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయానికి సంబంధించిన సర్వే నంబర్ 120లో గల 15.31 ఎకరాల భూమిని సోమవారం డీఐ కృష్ణయ్య, సర్వే పాండురంగారెడ్డి, ఈఓ మోహన్‌రావు స్థానికులతో కలిసి పరిశీలించారు. పలుచోట్ల హద్దురాళ్లను పరిశీలించారు. వచ్చేవారం నక్ష ప్రకారం సర్వే నంబర్ల వారిగా హద్దురాళ్లను నిర్ణయిస్తామని తెలిపారు. అదేవిధంగా మండల కేంద్రంలో సర్వే నంబర్ 76లో గల 6.06 ఎకరాల భూమిని పరిశీలించి, కొంత భాగం అన్యాక్రాంతమైనట్లు గుర్తించారు. ఈ భూమికి కూడా వచ్చే వారమే క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టి హద్దులు నిర్ధారిస్తామని ఆలయ నిర్వాహకులకు గ్రామస్తులకు తెలిపి అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఎలాంటి సర్వే చేయకుండా, అక్కడక్కడ హద్దులను పరిశీలించి.. తిరిగి సర్వే వాయిదా వేయడంలో అంతర్యమేమిటో అర్థం కావడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఆంజనేయులు, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు జంగారెడ్డి, శాయిరెడ్డి, టిక్‌లాల్, బీక్యానాయక్, అర్చకులు శ్రీధర్ తదితరులు ఉన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన కల్పించండి



అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ వినితాదేవి

సీడీపీఓ వినితాదేవి

అబ్దుల్లాపూర్‌మెట్: గర్భిణులు, బాలింతలు పౌష్టికహారంపై అవగాహన కలిగి ఉండాలని సీడీపీఓ వినితాదేవి అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా సోమవారం పెద్దఅంబర్‌పేట అంగన్‌వాడీ కేంద్రం–3లో నిర్వహించిన సమావేశానికి ఆమె హాజరై మాట్లాడుతూ.. ఐసీడీఎస్ శాఖ ద్వారా అందించే పౌష్టికహారంపై సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు అవగాహన కల్పించాలన్నారు. పక్షోత్సవాల్లో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కల్యాణి, టీచర్స్ నామిరెడ్డి నిర్మల, గిరిజ, ఉమా, వెంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల భవనాన్ని పూర్తిచేయండి

- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి ఎన్‌ఎస్‌యూఐ నేతల వినతి

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం సమీపంలోని వినోబానగర్‌లో నిర్మిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణాన్ని పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని ఎన్ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు నందకిషోర్ సోమవారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతిపత్రాన్ని సమర్పించారు. నందకిషోర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారని.. ప్రస్తుతం నిర్మాణ పనులను నిలిపివేశారని తెలిపారు. పనులు పూర్తిచేసి డిగ్రీ తరగతులు ఈ విద్యా సంవత్సరంలో కొత్త భవనంలో ప్రారంభం అయ్యే విధంగా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి.. పనులు ఎందుకు నిలిచిపోయాయని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ విద్యాసంవత్సరంలోనే భవనం అందుబాటులోకి వచ్చేవిధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.



ఇబ్రహీంపట్నం: ఎమ్మెల్యే మల్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఎన్ఎస్‌యూఐ నేతలు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు..

మంచాల: ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించే విధంగా చర్యలు తీసుకుంటామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. సోమవారం అఖిల భారత యాదవ మహాసభ నాయకులు నగరంలో ఎమ్మెల్యేను కలిసి ఘనంగా సన్మానించారు. యాదవులకు ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు అందేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు వెంకటేశ్ యాదవ్, బాలరాజు, ఐలయ్య, యాదయ్య, రాజేష్, కుమార్, మధు, ప్రవీణ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.